వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ


PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 347 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | జూన్ 2025 | వెల : రూ 10/-

## స్థానిక ఎన్నికలకు
# కాంగ్రెస్ సన్నద్ధం

గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామంటున్న పార్టీ

- నియోజకవర్గాల వారీగా మొదలైన సమావేశాలు
- ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయం

క్షేత్రస్థాయిలో కేడర్‌ను అప్రమత్తం చేస్తున్న అధిష్ఠానం



**హైదరాబాద్- ప్రజా స్వేచ్ఛ**

స్థానిక సమరానికి అధికార కాంగ్రెస్ పార్టీ సన్నద్ధం అవుతోంది. ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా సత్తా చాటి మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఆ మేరకు క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని, కార్యకర్తలను పార్టీ పెద్దలు అప్రమత్తం చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏఐసీసీ పరిశీలకులు ఎమ్మెల్యేలతో కలిసి సమావేశాలు నిర్వహిస్తున్నారు. 90 శాతానికి పైగా స్థానాల్లో పార్టీ జెండా ఎగురవేయాలని, ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని

-మిగతా 3 లో

-మిగతా



## జులై 4న పీఏసీ సమావేశం

- అదే రోజు గ్రామస్థాయి నేతలతో బహిరంగసభ
- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ**

రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం జులై 4న గాంధీభవన్‌లో జరుగుతుందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పీఏసీ సమావేశం అనంతరం పీసీసీ విస్తతస్థాయి సమావేశం ఉంటుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఎల్బీ స్టేడియంలో

-మిగతా 3 లో

# నక్సలిజాన్ని అంతమొందిస్తాం

- ఆయుధాలు పట్టుకున్న వారితో చర్చల్లేవ్
- ఉగ్రదాడులకు మోడీ హయాంలో దీటైన జవాబు
- గతంలో దాడులు చేసినా కాంగ్రెస్ ఏమీ చేయలేదు
- పసుపు బోర్డుతో పాటు ఎక్స్‌పోర్ట్, ఆర్గానిక్ లిమిడెట్ బ్రాంచులు నిజామాబాద్‌లోనే ఏర్పాటు చేస్తాం
- పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభోత్సవంలో కేంద్ర హెూంశాఖమంత్రి అమిత్ షా

**నిజామాబాద్ -ప్రజా స్వేచ్ఛ**

'మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి జనజీవన స్రవంతిలో కలవాలి. సరెండర్ అయ్యేవారుంటే అవ్వండి. లేకుంటే 2026 వరకు మేమే నక్సలిజాన్ని అంతమొందిస్తాం. ఆయుధాలు పట్టుకున్న వారితో ఎట్టి పరిస్థితుల్లో చర్చల్లేవ్' అని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. నిజామాబాద్ జిల్లా



కేంద్రంలో ఏర్పాటు చేసిన జాతీయ పసుపుబోర్డు కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. డి.శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన

-మిగతా 3 లో



## ఢిల్లీలో కాంగ్రెస్‌తో బీజేపీ కుస్తీ, తెలంగాణలో మాత్రం దోస్తీ

- కాంగ్రెస్ ప్రభుత్వంపై విచారణకు కేంద్రానికి ఏం అడ్డు వస్తుంది..?
- అమిత్ షాను ప్రశ్నించిన కేటీఆర్
- తెలంగాణలోని రేవంత్ సర్కారు.. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ఏటీఎంలా మారిపోయింది

**హైదరాబాద్ -ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణలోని రేవంత్ సర్కారు.. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలకు ఏటీఎంలా మారిపోయిందని నిజామాబాద్ గడ్డపై తేల్చిచెప్పిన మీరు, మరి కేంద్ర హెూంమంత్రిగా ఎందుకు విచారణకు ఆదేశించడం లేదో చెప్పగలరా..? అని అమిత్ షాను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. కేంద్ర అత్యున్నత దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీతో.. అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వంపై విచారణ జరపడానికి కేంద్రానికి ఏం అడ్డు వస్తుందో తెలంగాణ ప్రజలకు వివరించగలరా..? అని అడిగారు. ఢిల్లీలో కాంగ్రెస్‌తో బీజేపీ కుస్తీ, తెలంగాణలో మాత్రం దోస్తీ అన్నట్టుగా సాగుతున్న కుమ్మక్కు రాజకీయాల వల్లే రేవంత్‌ను వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలకు సమాధానం ఉందా..?

-మిగతా 3 లో

# పూరీలో తొక్కిసలాట

- ముగ్గురు మృతి-50 మంది పైగా గాయపడ్డారు

**భువనేశ్వర్-ప్రజా స్వేచ్ఛ**

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్రలో మరోమారు విషాదం చోటుచేసుకుంది. పూరీ రథయాత్రలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం గుండీచా దేవాలయం వెలుపల జరిగిన తొక్కిసలాటలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 50 మంది పైగా గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రుల కు

-మిగతా 3 లో



## పసుపు బోర్డుతో రైతులకు ప్రయోజనం కలిగేలా చూడండి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**నిజామాబాద్ -ప్రజా స్వేచ్ఛ**

పసుపు బోర్డుతో రైతులకు ప్రయోజనం కలిగేలా చూడాలని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నిజామాబాద్‌లో నూతనంగా నెలకొల్పిన జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఆదివారం అట్టహాసంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా బస్వా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు.



-మిగతా 3 లో

## త్రిభాషా విధానంపై వెనక్కి

- ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని మహారాష్ట్ర సర్కారు నిర్ణయం



**ముంబయి-ప్రజా స్వేచ్ఛ**

ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో.. తాజాగా వెనక్కి తగ్గింది. త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానంపై ఎలా ముందుకెళ్లాలి, దాన్ని ఎలా

-మిగతా 3 లో



## ఎంపీ రఘునందన్‌రావుకు మళ్లీ బెదిరింపులు..

- మావోయిస్టుల నుంచి కాల్స్ వచ్చినట్టు అనుమానం?
- ఎట్టిపరిస్థితుల్లోనూ చంపేస్తామని హెచ్చరికలు

**హైదరాబాద్**

బీజేపీ ఎంపీ రఘునందన్ రావుకు మళ్లీ బెదిరింపు ఫోన్‌కాల్స్ వచ్చాయి. ఇటీవలే ఆయనకు కొందరు ఆగంతకులు కాల్ చేసి చంపేస్తామని బెదిరించడంతో ఆర్మ్‌డ్ సిబ్బందితో ఎస్కార్ట్ వాహనాన్ని రక్షణగా ఇచ్చారు. ఆదివారం మళ్లీ రెండు కొత్త ఫోన్ నంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినట్టు

-మిగతా 3 లో

# 477 డ్రోన్లు, 60 క్షిపణులతో ఉక్రెయిన్‌పై రష్యా దాడి..

## అమెరికా సహాయం కోరిన జెలెన్స్కీ




**కీవ్-ప్రజా స్వేచ్ఛ**

ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో వైమానిక దాడికి పాల్పడింది. శనివారం రాత్రివేళ 477 డ్రోన్లు, 60 క్షిపణులను ప్రయోగించింది. ఈ దాడిలో ఉక్రెయిన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానం ధ్వంసమైంది. దీంతో పైలట్ మరణించాడు. ఉక్రెయిన్‌లోని ఏడు వైమానిక స్థావరాలను రష్యా లక్ష్యంగా చేసుకున్నదని ఆ దేశ అధికారులు తెలిపారు. నివాస ప్రాంతాలను కూడా రష్యా విడిచిపెట్టడం లేదని ఆరోపించారు. స్మిలాలోని ఒక నివాస భవనంపై దాడిలో ఒక బాలుడు గాయపడినట్లు వెల్లడించారు.కాగా, రష్యా తాజా దాడుల నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ అమెరికా మద్దతు, సహాయాన్ని కోరారు. 'దురాక్రమణదారుడిపై ఒత్తిడి అవసరం. అలాగే రక్షణ కూడా అవసరం' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఉక్రెయిన్ వైమానిక రక్షణను బలోపేతం చేసేందుకు అమెరికా, పాశ్చాత్య మిత్రదేశాలు తక్షణం మద్దతు ఇవ్వాలని ఆయన అభ్యర్థించారు. అమెరికన్ రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అయితే అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉక్రెయిన్‌కు కొత్తగా ఎలాంటి సైనిక సహాయాన్ని ఆమోదించలేదు.

# కొవిడ్‌తో మరో ఇద్దరు మృతి..

## ఢిల్లీలో 21కి పెరిగిన కరోనా మరణాలు..!



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**

దేశ రాజధాని ఢిల్లీ నగరంలో ఇద్దరు కొవిడ్‌తో మరణించారు. ఇద్దరూ ఇప్పటికే వేర్వేరు వ్యాధులబారినపడి చికిత్స పొందుతున్నారు. ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న సమయంలోనే వారికి వైరస్ సోకవడంతో పరిస్థితి విషమించింది. కేంద్ర ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకారం.. ఢిల్లీకి చెందిన 73 సంవత్సరాల వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఆయన ఇప్పటికే మెటాస్టాటిక్ లంగ్ కార్సినోమా, అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్, బీ/ఎటల్ న్యుమోనియా, అధిక రక్తపోటుతో బాధపడుతున్నాడు. మరో వ్యక్తికి 76 సంవత్సరాలుంటాయి. అతనికి ఇప్పటికే సెప్టిక్ షాక్, మల్టిపుల్ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్, న్యుమోనియా, డీఎం, అధిక రక్తపోటు, గుండె జబ్బులతో సెప్టిసిమియాతో బాధపడుతున్నాడు. ఇద్దరు మృతులు చికిత్స పొందుతున్న సమయంలో కొవిడ్ సోకింది. వారి పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు. ఇదిలా ఉండగా.. తాజాగా డేటా ప్రకారం.. ఢిల్లీలో 267 కొవిడ్ యాక్టివ్ కేసులున్నాయి. ఇందులో 44 మందికి కొత్తగా పాజిటివ్‌గా తేలింది. ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి ఢిల్లీలో 3533 మంది కొవిడ్ బారినపడి కోలుకున్నారు. తాజాగా 59 మంది కోలుకున్నారు. ఇప్పటి వరకు ఢిల్లీలో 21 మంది మృతి చెందారు.

# పాకిస్థాన్ సైన్యానివి తప్పుడు ఆరోపణలు..

## తీవ్రంగా ఖండించిన భారత్



**న్యూఢిల్లీ,ప్రజా స్వేచ్ఛ**


పాకిస్థాన్ లో శనివారం జరిగిన ఆత్మాహుతి దాడి వెనుక భారత్ హస్తం ఉందని పాక్ సైన్యం చేసిన ఆరోపణలను భారత విదేశాంగ శాఖ కొట్టిపారేసింది. ఆ దాడితో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. దాడి వెనుక తమ హస్తం ఉందంటూ పాకిస్థాన్ సైన్యం చేస్తున్నవి పూర్తిగా తప్పుడు ఆరోపణలని పేర్కొంది. భారత విదేశాంగ శాఖ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.పాక్‌లోని ఖైబర్ పక్తుంఖ్వా ప్రావిన్స్‌లో శనివారం ఈ ఆత్మాహుతి దాడి జరిగిందని, ఈ దాడి నేపథ్యంలో భారత్‌పై నిందలు వేస్తూ పాకిస్థాన్ సైన్యం చేసిన అధికారిక ప్రకటన తమ దృష్టికి వచ్చిందని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది. పాక్ సైన్యం ప్రకటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టంచేసింది. కాగా పేలుడు పదార్థాలున్న వాహనంతో ఓ ఉగ్రవాది ఆర్మీ కాన్వాయ్‌పైకి దూసుకెళ్లాడు. దాంతో వాహనంలో భారీపేలుడు సంభవించింది. ఈ పేలుడులో 13 మంది పాక్ సైనికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పౌరులు, ప్రభుత్వాధికారులు కలిపి మరో 24 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఇదిలావుంటే.. పాకిస్థాన్‌లోని తాలిబన్ హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూపునకు చెందిన ఉసూద్-అల్-హర్బ్ ఈ పేలుడుకు బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించింది.

# మార్స్‌పై నీటి జాడలు..!

## కీలక సమాచారం వెల్లడించిన నాసా క్యూరియాసిటీ రోవర్..!

**న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ**

ఈ అనంత విశ్వంలో ఎన్నో రహస్యాలున్నాయి. భూమిని పోలిన గ్రహాలతో పాటు శాస్త్రవేత్తలు పరిశోధనలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఎన్నో మిస్టరీలను ఛేదించారు. మార్స్‌పై సైతం శాస్త్రవేత్తలో పరిశోధనలు చేపడుతున్న విషయం తెలిసిందే. మార్స్‌పై జీవం ఉన్నదా?అనే కోణంలో పరిశోధనలు సాగుతుండగా.. ఈ దిశగా కీలక పురోగతి చోటు చేసుకున్నది. నాసా క్యూరియాసిటీ రోవర్ తాజాగా మార్స్‌పై ఓ రహస్య ప్రాంతంలో తవ్వకాలు చేపట్టింది. ఈ ప్రాంతంలో అక్కడ భూగర్భంలో నీరు చాలాకాలం పాటు క్రియాశీలంగా ఉన్నట్లు ఆధారాలు లభించాయి. ఇది మార్స్ వాతావరణ చరిత్రను తిరగరాసే అవకాశం ఉన్నది.నాసాకు చెందిన క్యూరియాసిటీ రోవర్ ప్రస్తుతం మౌంట్ షార్ప్ భాగంలోని బాక్స్‌వర్క్ ప్రాంతాన్ని పరిశీలిస్తోంది. ఇది మార్స్ ఉపరితలంపై 12 మైళ్ల పొడవున విస్తరించి ఉంది. ఇప్పటి వరకు ఇది కేవలం ఉపగ్రహాల ద్వారా మాత్రమే గమనించిన ఈ ప్రాంతానికి తొలిసారిగా రోవర్ చేరుకుంది. ఇక్కడి






రాళ్లలో రాళ్లలో మెగ్నీషియం సల్ఫేట్, కాల్షియం సల్ఫేట్ వంటి ఉప్పు ఖనిజాలు అధికంగా ఉన్నట్లు గుర్తించింది. ఇవి సాధారణంగా నీరు ఆవిరైపోయిన తర్వాతే ఏర్పడుతాయి. దాంతో అక్కడ గతంలో నీరు ఉందని.. ఆ తర్వాత వాతావరణంలోని మార్పులతో ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నట్లుగా సూచిస్తున్నది. కేవలం మట్టి, ఖనిజాలే కాకుండా రాళ్లలో మినరల్ వీన్స్‌ని సైతం గుర్తించారు. నీరు చాలా కాలం పాటు భూగర్భంగా ప్రవహించి ఉండే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఇది నిజమైతే, మార్స్‌పై జీవనానికి అనువైన వాతావరణం భావించిన దానికంటే ఎక్కువ కాలం పాటు కొనసాగినట్లుగా అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం రోవర్ రాళ్లను తవ్వి నమూనాలను సేకరిస్తోంది. వాటిని విశ్లేషించగా మార్స్ జలరాశులకు సంబంధించిన చరిత్ర, గ్రహ నిర్మాణ పరిణామాలపై కీలక సమాచారం లభించే అవకాశం ఉంది. మార్స్‌తో పాటు ఇతర గ్రహాలు, పలు గ్రహాల ఉపగ్రహాల్లోనూ నీటి ఉనికిని గుర్తించారు. భూమి ఉపగ్రహమైన చంద్రుడి ఉపరితలంపై 2009లో భారత్ చేపట్టిన చంద్రయాన్-1 మిషన్ ద్వారా దక్షిణ ధ్రువ ప్రాంతంలో నీటి జాడలను గుర్తించారు. అలాగే, జూపిటర్ ఉపగ్రహమైన యూరోపాలోనూ మంచుతో కప్పిన ఉపరితలంలోని లోతుల్లో భారీ జలరాశులు ఉన్నట్లు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. బృహస్పతి ఉపగ్రహమైన గానిమీడ్ భూగర్భంలో సముద్రం ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. శని ఉపగ్రమైన ఎన్సెలడస్ ఉపరితలంలో నీరు మంచురూపంలో ఉందని అంచనా. టైటాన్‌లో మీథేన్, ఇథేన్ నిండిన ఉపగ్రహం.. ఉపరితలంలో నీటి సముద్రం ఉండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

# గగనతలంపై ఇరాన్ ఆంక్షలు ఎత్తివేత



**టెహరాన్-ప్రజా స్వేచ్ఛ**

ఇజ్రాయిల్‌తో తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో మూసివేసిన తమ గగనతలాన్ని అంతర్జాతీయ విమాన సర్వీసుల కోసం తిరిగి తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దేశంలోని మధ్య, పశ్చిమ ప్రాంతాల మీదుగా విమానాల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు ఆ దేశ రోడ్లు, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇజ్రాయెల్‌తో 12 రోజుల పాటు సాగిన వైమానిక ఘర్షణల అనంతరం ఈ కీలక నిర్ణయం వెలువడింది. పశ్చిమాసియాలో ఇరాన్ ఇజ్రాయిల్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. అమెరికా అండతో నెతాన్యాహు ఆపరేషన్ రైజింగ్ లయన్ పేరుతో ఆ దేశ అణు స్థావరాలపై దాడులు చేశారు. ఆ తర్వాత ఆపరేషన్ ప్రామిస్ ట్రూ పేరుతో ఇరాన్ ఇజ్రాయిల్ సైన్యంపై ప్రతీదాడులకు దిగింది. రెండు దేశాల తమ గగనతలాన్ని మూసివేశాయి. భారత్ ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు తన గగనతలం గుండా ఇండియన్ పౌరులను తరలించడానికి అంగీకరించింది. రెండు రోజుల తర్వాత అన్యూహంగా అమెరికా ఇరాన్ దేశంపై బాంబుల వర్షం వేసింది. ఆగ్రహించిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని..కువైట్, ఖతార్ దేశాల్లో ఉన్న యూఎస్ ఎయిర్ బేస్‌లపై క్షిపణుల వర్షం కురిపించారు. దీంతో బిత్తరపోయిన ట్రంప్ ..ఖతర్ రాయబారంతో రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో గల్ఫ్ యుద్ధం ముగిసిపోయింది.

# ఫ్రాన్స్‌లో బహిరంగ ధూమపానం నిషేధం



**పారిస్:ప్రజా స్వేచ్ఛ**


ఫ్రాన్స్‌లోని బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధించబడింది. ఉల్లంఘించిన వారికి 700 యూరోల జరిమానా విధించబడుతుందని తెలిపింది. పార్కులు, క్రీడా వేదికలు, బీచ్‌లు, బస్ స్టాప్‌లు, పాఠశాలలు, పిల్లలు ఉండే ప్రదేశాలలో ధూమపానం నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం శనివారం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ చట్టం ఆదివారం నుండి అమలులోకి వచ్చింది. అయితే ఎలక్ట్రానిక్ సిగరెట్లకు నిషేధం వర్తించదు. బార్‌లు మరియు రెస్టారెంట్‌లపై ఎటువంటి నిషేధం లేదు. బీచ్‌లో పొగ నుండి పిల్లలను రక్షించడానికి ఈ నిషేధం విధించబడిందని అధికారులు తెలిపారు. పాఠశాలలు, స్విమ్మింగ్ పూల్స్, లైబ్రరీలు, మైనర్లు ఉండే ఇతర ప్రదేశాల నుండి 10 మీటర్ల లోపల ప్రజలు ధూమపానం చేయకూడదు. ఈ ప్రాంతాల్లో ధూమపానం చేయడానికి కనీస దూరాన్ని రాబోయే రోజుల్లో ప్రకటిస్తామని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. అటువంటి ప్రాంతాలను గుర్తించడానికి ఉపయోగించే గుర్తును కూడా విడుదల చేస్తామని మంత్రిత్వ శాఖ తెలిపింది. నిషేధాన్ని ఉల్లంఘించిన వారికి 135 యూరోలు నుండి గరిష్టంగా 700 యూరోల వరకు జరిమానా విధిస్తామని పేర్కొంది. కేఫ్ టెర్రస్‌లపై ధూమపానం చేయడానికి అనుమతి కొనసాగడాన్ని నేషనల్ కమిటీ అగైన్స్ట్ స్మోకింగ్(సిఎన్సిటి) విమర్శించింది. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానంపై నిషేధం స్వాగతించదగినదే కానీ చట్టం సరిపోదని సిఎన్సిటి నాయకత్వం తెలిపింది.

# దేశంలోనే ఏఐ డిజిటల్ హైవే అందుబాటులోకి..!

## దీని ప్రత్యేకతలేంటో తెలుసా..?

**న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ**

భారత జాతీయ రహదారుల రూపు మారిపోతున్నది. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్రం కసరత్తు చేస్తున్నది. దేశంలోనే తొలిసారిగా ఏఐ ఉపయోగించబోతున్నది. వాహనదారుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణను ప్రధాన లక్ష్యంగా దేశంలో తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ATMS) ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఢిల్లీ-గురుగ్రామ్‌లను కలిపే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ స్మార్ట్ వ్యవస్థను ప్రారంభించడంతో.. ఈ రహదారి దేశంలో తొలి ఆధారిత డిజిటల్ హైవేగా గుర్తింపు పొందింది. ఈ అత్యాధునిక వ్యవస్థ 14 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించగలదు. సీటు బెల్ట్ లేకపోవడం, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం, అధిక వేగంతో ప్రయాణించడాన్ని తక్షణమే గుర్తిస్తుంది. స్మార్ట్ కెమెరాలు వాహనాల వివరాలను తక్షణమే ఎన్ఐసీ



ఈ-చలాన్ పోర్టల్, సంబంధిత పోలీసులకు పంపిస్తుంది. దాంతో మానవ జోక్యం లేకుండానే ఆటోమేటిక్‌గా చలాన్స్ జారీ అవుతాయి. భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) మార్గదర్శకాలకు అనుగుణంగా ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (IHMCL) ఈ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే, ఎన్‌హెచ్-48పై మొత్తం 56.46 కిలోమీటర్ల పొడవునా ఈ సిస్టమ్ అమలులో ఉంది. ప్రతి కిలోమీటరుకు ఒకటి చొప్పున 110 హై-రిజల్యూషన్ PTZ కెమెరాలు అమర్చారు. ఇవి 24 గంటలూ రహదారి పరిస్థితులను పర్యవేక్షిస్తాయి. ఈ వ్యవస్థకు కేంద్ర కంట్రోల్ రూమ్ ఒక డిజిటల్ బ్రెయిన్ లా పనిచేస్తుంది. ప్రమాదాలు, పొగమంచు, అడ్డంకులు, జంతువుల ప్రవేశం తదితర అంశాలను ఇది వెంటనే గుర్తించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేస్తుంది. డిజిటల్ డిస్‌ప్లే బోర్డుల ద్వారా ప్రయాణికులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తుంది.

# స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ సన్నద్ధం

(మొదటి తరువాయి)
నిర్ణయించారు.
జిల్లాలో 14 మండలాలు, ఒక మున్సిపల్ కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీలు ఉన్నాయి. 266 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ఏదాదిన్నర క్రితం ముగియగా, మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీ కాలం ఏడాది క్రితం ముగిసింది. మున్సిపాలిటీల పాలక వర్గాల పదవీ కాలం ఈ ఏడాది జనవరి నెలాఖరులో ముగిసింది. అన్నింటి లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతున్నది. బీసీ రిజర్వేషన్ల వ్యవహారం ఎటూ తేలకపోవడంతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అడుగులు ముందుకు పడడం లేదు. బీసీ కులగుణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వానికి పంపించింది. చట్టపరంగా ఆమోదం పొందకపోయినా పార్టీ పరంగా 42 శాతం సీట్లను బీసీలకు కేటాయిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికలను సత్వరమే నిర్వహించాల ని కొందరు మాజీ సర్పంచ్‌లు కోర్టును ఆశ్రయించారు. ఆ మేరకు హైకోర్టు తుది తీర్పును వెలువరించింది. సెప్టెంబరు నెలాఖరు లోపు స్థానిక సంస్థల ఎన్నికలను పూర్తిచేయాలని ఆదేశించింది. అయితే బీసీలకు రిజర్వేషన్లపై ఎలా ముందుకు పోవాలని ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నది. ఏదీ ఎలా ఉన్నా కోర్టు ఆదేశాల మేరకు మూడునెలల్లో ఎన్నికలు పూర్తికావడం ఖాయంగా కనబడుతున్నది. పాత రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరిగితే జనరల్ స్థానాల్లో కూడా బీసీలు, ఎస్సీలు పోటీచేయాలని భావిస్తున్నారు. ఇప్పటికే స్థానిక ఎన్నికల్లో పోటీలో ఉంటున్నామని అంతర్గతంగా ప్రచారం చేసుకుంటున్నారు. ఆయావర్గాలను కలుస్తూ తమ మద్దతు కావాలని కోరతున్నారు.

**– నియోజకవర్గాల స్థాయి సమావేశాలు..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పది, పదిహేను రోజుల్లో రిజర్వేషన్ల విషయమై తేల్చి వరుసగా ఆయా ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతున్నది. ఈక్రమంలో తమ పార్టీ యంత్రాంగం క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలను అప్రమత్తం చేస్తున్నది. నియోజకవర్గాల స్థాయి సమావేశాలు నిర్వహిస్తూ సన్నద్ధం చేస్తున్నారు. ఆదివారం పెద్దపల్లి నియోజకవర్గస్థాయి సమావేశాలు జరిగాయి. ముందుగా ఏ ఎన్నికలు జరిగినా అందుకు సంసిద్ధంగా ఉండాలని పార్టీ కోసం పనిచేసే వారికి, గెలుపు గుర్రాలకే పార్టీ టికెట్లు ఇస్తుందని, ఈ పర్యాయమే గాకుండా మరో ఐదేళ్లు కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని చెబుతున్నారు. ఈ స్థానిక సంస్థల్లో 90 శాతం స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని చెబుతున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయేలా అధిష్ఠానం పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు పార్టీ క్యాడర్‌ను అప్రమత్తం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల వ్యూహాలు, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టి స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటితేనే మూడున్నరేళ్ల తర్వాత జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి రాగలుగుతుందని పార్టీ నాయకులు క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. స్థానికసంస్థల ఎన్నికలు మూడు నెలల్లోగా పూర్తికావడం ఖాయం అని తేలిపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం అవుతున్నారు. పార్టీ టిక్కెట్ల కోసం ఎమ్మెల్యేలను కాకా పడుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు అయిన తర్వాత, ఆ రిజర్వేషన్లను బట్టి అభ్యర్థులను ఖరారు చేయనున్నారు.

# నక్సలిజాన్ని అంతమొందిస్తాం

(మొదటి తరువాయి)
రైతు సమ్మేళనం సభలో ఆయన మాట్లాడారు. 2014 కంటే ముందు ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి మనవారిని కాల్చి వెళ్లిపోతుండేవారని.. ఎవరూ స్పందించేవారు కాదన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక ఉగ్రదాడులకు దీటైన జవాబు ఇస్తున్నామని తెలిపారు. వారు 'ఉరి'లో అటాక్ చేస్తే సర్జికల్ స్ట్రైక్ చేశామని, పుల్వామాలో ఎయిర్‌స్ట్రైక్‌తో, పహల్గాంలో ఆపరేషన్ సిందూర్‌తో నేరుగా ఉగ్రస్థావరాలనే మట్టుబెట్టామని తెలిపారు. ఈ దాడులతో మన బలమెంతో పాకిస్తాన్‌కు, ప్రపంచానికి తెలిసిందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక సురక్షిత భారత్ కోసం సంకల్పించారని, అందుకే అటు ఉగ్రవాదంతో పాటు నక్సలిజాన్ని అంతం చేస్తున్నామని తెలిపారు. ఆదివాసుల అభివృద్ధిని అడ్డుకుంటూ వారి మరణాలకు కారణమవుతున్న మావోయిస్టులను అంతం చేద్దామా.. వద్దా.. అని సభాసదులను ఉద్దేశించి అడిగారు. వారిని చంపొద్దని తెలంగాణ నుంచి కొందరు అంటున్నారని, మావోయిస్టులు అటు పోలీసులను, ఇటు అమాయకులైన ఆదివాసులను చంపుతున్నారని, వారి కుటుంబాలకు ఏం జవాబు చెప్తారని ప్రశ్నించారు. ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధికి ఆటంకం కల్పిస్తున్న మావోయిస్టులను 2026 కల్లా అంతమొందించడమే తమ లక్ష్యమన్నారు. ఇప్పటి వరకు 10 వేల మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు.

**ఢిల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా తెలంగాణ**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక పనుల్లో కమీషన్ దందా నడిపిందని, కాళేశ్వరం పనుల్లో అనేక అవకతవకలకు పాల్పడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వారిపై ఏమైనా చర్యలు తీసుకుందా అని అమిత్ షా ప్రశ్నించారు. తెలంగాణను గతంలో కేసీఆర్ కుటుంబం ఏటీఎంగా వాడుకుందని.. ప్రస్తుతం కాంగ్రెస్.. ఢిల్లీకి ఏటీఎంగా మార్చుకుందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు.

**ఎక్స్‌పోర్ట్, ఆర్గానిక్ లిమిటెడ్ బ్రాంచులు ఇక్కడే..**

40 ఏండ్ల పసుపు రైతుల కలను సాకారం చేసేందుకు ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జాతీయ పసుపు బోర్డును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మోదీ ఏదైతే చెప్తారో అది ఆచరణలో చేసి చూపిస్తారన్నారు. అధిక విస్తీర్ణంలో పసుపు పండించే నిజామాబాద్ జిల్లాలో బోర్డును ఏర్పాటు చేయడంతో పాటు, ఇదే జిల్లాకు చెందిన రైతుబిడ్డ పల్లె గంగారెడ్డిని బోర్డు చైర్మెన్‌గా నియమించామని తెలిపారు. పసుపు బోర్డుతో పాటు భారత్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్, ఆర్గానిక్ లిమిటెడ్ బ్రాంచీలు సైతం ఇక్కడే ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. అమెరికా, కెనడా, యూరప్ లాంటి ప్రపంచ దేశాలకు పసుపును ఎగుమతులు చేసి రైతుల ఆదాయం పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజరు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, పసుపు బోర్డు చైర్మెన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేశ్‌రెడ్డి, డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి, కలెక్టర్ టి.వినరు కృష్ణారెడ్డి, పసుపు బోర్డు వైస్ చైర్మెన్ భవాని, ఇతర ఉన్నతాధికారులు, కార్పొరేషన్ల చైర్మెన్లు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కాంగ్రెస్‌తో బీజేపీ కుస్తీ, తెలంగాణలో మాత్రం దోస్తీ

(మొదటి తరువాయి)
తెలంగాణ ప్రజల గొంతుకై నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్‌ను ఒంటరిగా ఎదుర్కోలేక, రేవంత్‌ను బీజేపీ పావుగా వాడుకుంటున్న మాట వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. గతంలో దేశ ప్రధాని మోదీ వచ్చినప్పుడు, ఏకంగా రాహుల్–రేవంత్ కలిసి ఆర్ఆర్ టాక్స్ పేరిట దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు కానీ దర్యాప్తునకు మాత్రం నేటికీ ఆదేశించలేదు. దేశ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి హోదాలో మీరు తెలంగాణకు వచ్చి కేవలం సీఎంపై అవినీతి ఆరోపణలు చేస్తే సరిపోతుందా..? పట్టపగలు ప్రజాధనం లూటీ చేస్తూ ఢిల్లీకి మూటలు పంపుతున్న కాంగ్రెస్ సీఎం అక్రమాలకు కేంద్ర అడ్డుకట్ట వేయలేదా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు కేటీఆర్. మరోవైపు.. ధాన్యం దిగుబడిలో పంజాబ్‌నే తలదన్ని దేశంలోనే నంబర్ వన్ స్థానానికి తెలంగాణ ఎదగడంలో కీలకపాత్ర పోషించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై బురదజల్లడం అత్యంత దురదృష్టకరం. ఎనిమిది మంది ఎంపీలను గెలిపించినా, ఇద్దరు కేంద్రమంత్రులున్నా, తెలంగాణలోని ఒక్క ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వకుండా, కనీసం ఒక్క ఐఐటీ, ఐఐఎం, మెడికల్ కాలేజీ వంటి ఉన్నత విద్యాసంస్థలు మంజూరు చేయకుండా బీజేపీ చేస్తున్న అన్యాయాన్ని నాలుగు కోట్ల ప్రజలు నిత్యం గమనిస్తూనే ఉన్నారు. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ లో పసుపు బోర్డుకు నయా పైసా కేటాయించకుండా.. పేరుకు పసుపు బోర్డు పెట్టి రిబ్బన్ కట్ చేస్తే ప్రయోజనమేంటి ? కనీసం సొంత భవనం కూడా కట్టకుండా.. సీఎంగా ఉన్నప్పుడు కేసీఆర్ గారు నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పసుపు బోర్డు ఆఫీసును ప్రారంభించడం సమంజసమేనా..? అసలు ఒక్క పసుపు బోర్డును ఇన్నిసార్లు ప్రారంభించడం సబబేనా? ఈ జనవరి 14న నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఢిల్లీ నుంచి కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ వర్చువల్‌గా పసుపు బోర్డును ప్రారంభించేశారు. మరోసారి మీరు ఇవాళ పసుపు బోర్డు కార్యాలయాన్ని ప్రారంభించడం వల్ల ప్రయోజనమేంటి..? అని కేటీఆర్ నిలదీశారు.

# పసుపు బోర్డుతో రైతులకు ప్రయోజనం కలిగేలా చూడండి

(మొదటి తరువాయి)
తెలంగాణ ప్రాంత పసుపు రైతుల చిరకాల వాంఛను గుర్తించి పసుపు బోర్డును ఏర్పాటు చేసిన కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు తెలిపారు. అత్యధిక విస్తీర్ణంలో పసుపు సాగు చేసే నిజామాబాద్ జిల్లాలో బోర్డును నెలకొల్పడం వల్ల ఈ ప్రాంత రైతుల పోరాటం ఫలించినట్లయ్యిందన్నారు. జాతీయ పసుపు బోర్డుతో నిజామాబాద్ జిల్లా ప్రతిష్ట మరింతగా ఇనుమడిస్తుందని, పసుపు రైతులకు ఇతోధికంగా మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ బోర్డు ఏర్పాటు పసుపు పంట ఎగుమతులు, ఆధునాతన సాగు విధానాలు, యాంత్రీకరణ, సరికొత్త



పరిశోధనలు, మెరుగైన మార్కెటింగ్ వంటి వసతులతో రైతులకు ప్రయోజనం కలిగేలా కేంద్రం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తోందని తెలిపారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు నెలకొని ఉన్నప్పటికీ రైతాంగ ప్రయోజనాల కోసం ఏడాది కాలంలోనే తమ ప్రభుత్వం రూ. లక్ష కోట్ల వరకు వెచ్చించిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజరు, రాష్ట్ర మంత్రి (ధనసరి అనసూయ) సీతక్క, ఎంపీ ధర్మపురి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# జులై 4న పీఏసీ సమావేశం

(మొదటి తరువాయి)
గ్రామస్థాయి నేతలతో భహిరంగ సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కమిటీ మీటింగ్‌లో బాగంగా నిర్వహిస్తున్న ఈ సభకు 15 వేల మంది హాజరుకానున్నారని తెలిపారు. వరంగల్ నేతలు వ్యవహారాలలో క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. జీవితాంతం లౌకికవాదిగా బతికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను ఒప్పుకోని డీఎస్ విగ్రహాన్ని బీజేపీ నాయకునితో ఆవిష్కరిస్తే ఆయన ఆత్మ క్షోభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్ విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించిందనీ, అయినా కాంగ్రెస్ నాయకులెవరికీ ఆహ్వానం లేదని తెలిపారు. డీఎస్ ఏనాడు బీజేపీలో లేరనీ, కొన్ని కారణాల వల్ల ఆయన బీఆర్ఎస్‌లో చేరారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఎప్పుడు ఉప ఎన్నిక జరిగినా కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని గుర్తిస్తామని తెలిపారు. మాజీ మంత్రి, దివగంత నేత ముఖేశ్ గౌడ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కొత్తగా నియమించబడిన టీపీసీసీ ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు పని విభజన చేస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# పూరీలో తొక్కిసలాట

(మొదటి తరువాయి)
ఒడిషా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝీ వ్యక్తిగతంగా, ప్రభుత్వం తరఫున క్షమాపణ చెప్పారు. భద్రతా ఏర్పాట్లలో జరిగిన వైఫల్యాలపై విచారణకు ఆదేశించారు. పూరీ జిల్లా కలెక్టర్ సిద్ధార్థ్ ఎస్ స్వియాన్, పోలీస్ సూపరింటెండెంట్ బినిత్ అగర్వాల్‌ను బదిలీ చేశారు. పూరీ సిడిపి విష్ణు చరణ్ పాటి, పోలీస్ కమాండెంట్ అజరు పధిని సస్పెండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల రూపాయల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. కాగా తొక్కిసలాటలో మరణించిన వారిని బసంతి సాహు (బోలాగర్హ్), ప్రేమకాంత్ మొహంతి, ప్రవతి దాస్ (బాలిపట్న)గా గుర్తించారు. రథయాత్ర నిర్వహణలో బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివిపిలకు ప్రోటోకాల్ కల్పించడంలోనే అధికార యంత్రాంగమంతా మునిగితేలిందని బాధితుల బంధువులు తప్పుబట్టారు. ప్రోటోకాల్ ఆంక్షలే తమవాళ్ల ప్రాణాలు తోడేశాయని వాపోయారు. పోలీసులంతా వివిఐపిల భద్రతకు వెళ్లిపోయారని, జనాలను నియంత్రించేందుకు ఎవ్వరూ లేకపోవడం వల్లే తొక్కిసలాట జరిగిందని వారు పేర్కొన్నారు. రద్దీ నేపథ్యంలో శనివారం రాత్రి దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయడంతో గందరగోళం నెలకొంది. ఆ తర్వాత భక్తులను ఒక్కసారిగా లోపలికి అనుమతించడంతో తొక్కిసలాట జరిగింది. దీనికితోడు రథాలను దగ్గర దగ్గరగా ఉంచడంతో పరిస్థితి అదుపు తప్పింది. శనివారం రాత్రి పోలీసుల జాడే కన్పించలేదని, దీంతో ప్రజలను అదుపు చేయడం సాధ్యపడలేదని మృతుల బంధువులు పేర్కొన్నారు. కాగా పలువురు బిజెపి మంత్రులు తమ బంధువులు, స్నేహితులను రథాల చెంతకు తీసుకుపోవడానికి ప్రయత్నించినట్లు తెలిసింది. రథయాత్రలో ఈ నెల 27న కూడా తొక్కిసలాట లాంటి పరిస్థితులు, భారీ ఉష్ణోగ్రతల కారణంగా 600 మంది పైగా అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలైన సంగతి విదితమే. రాష్ట్రంలో, కేంద్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ గొప్పలు చెప్పుకునే బిజెపి ప్రభుత్వం ఒడిశా ప్రజలు ఎంతో ఆరాధించే జగన్నాథ రథయాత్రను కూడా సరిగా నిర్వహించలేకపోవడం దారుణమని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విమర్శించారు. భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట జరిగిందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. మృతులకు తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి బంధువులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# ఎంపీ రఘునందన్‌రావుకు మళ్లీ బెదిరింపులు..

(మొదటి తరువాయి)
రఘునందన్‌రావు తెలిపారు.ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, లేకుంటే ఎట్టి పరిస్థితిలో వదిలేది లేదని, త్వరలోనే చంపేస్తామని వార్నింగ్ ఇచ్చినట్టు చెప్పారు. 9489556347, 7365035440 నంబర్ల నుంచి బెదిరింపులు రావడంతో పోలీసులు సైతం అప్రమత్తమయ్యారు. అయితే, ఫోన్ చేసిన వ్యక్తులు ఆంధ్రప్రదేశ్ మావోయిస్టు కమిటీ ఆదేశాల మేరకు చంపడానికి ఐదు బృందాలు రంగంలోకి దిగాయని చెప్పినట్టు తెలిసింది. దీంతో రఘునందన్‌రావు మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# త్రిభాషా విధానంపై వెనక్కి

(మొదటి తరువాయి)
అమలు చేయాలనే దానిపై విద్యావేత్త నరేంద్ర జాదవ్ నేత ృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు."ఒకటో తరగతి నుంచి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి సంబంధించి ఏప్రిల్, జూన్‌లలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానం అమలుపై సిఫారసులు చేసేందుకు డా.నరేంద్ర జాదవ్ నేత ృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం" అని ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం ఫడ్నవీస్ తెలిపారు. 1 నుంచి 12వ తరగతి వరకు ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని డా.రఘునాథ్ మషేల్కర్ కమిటీ చేసిన సిఫారసులను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్ధవ్ ఠాక్రే అంగీకరించారని, దాని అమలుపై ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారని గుర్తుచేశారుజాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. ఈ విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే.. ఇంగ్లీష్, మరాఠీ మీడియం పాఠశాలల్లో చదువుతున్న 1–5 తరగతుల విద్యార్థులకు హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఏప్రిల్ 16న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో.. హిందీని ఆప్షనల్‌గా మారుస్తూ సవరణ ఉత్తర్వు జారీ చేసింది. అయినా.. ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు కొనసాగాయి. ఈ క్రమంలో ప్రభుత్వంపై పోరాడేందుకు శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, 'మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన' (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేలు ఏకం కానున్నారనే చర్చ మొదలైంది. ఈ పరిణామాల నడుమ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దీంతో వచ్చే నెల 5న శివసేన యూబీటీ, ఎంఎన్ఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించాలనుకున్న నిరసనను రద్దు చేస్తున్నట్టు సంజరు రౌత్ ప్రకటించారు.

# సంపాదకీయం

## బనకచర్ల...మరో కాళేశ్వరం..!

బనకచర్లపై ఇరు రాష్ట్రాలతో సమావేశం ఏర్పాటు చేస్తానని కేంద్రమంత్రి పాటిల్ ప్రకటించిన నేపథ్యంలో ముందుగా ఇరు రాష్ట్రాలు కూర్చుని ఈ సమస్యపై చర్చించాలి. అలాగే కేంద్రం కూడా వివరాలు తెప్పించుకుని సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. కెసిఆర్ కాళేశ్వరం చేపడతామని అన్నప్పుడు కేంద్రం ప్రేక్షక పాత్ర వహించింది. ఇవాళ లక్షకోట్లకు పైగా దుబారా అయ్యాయి. కాళేశ్వరం ఎటిఎంగా మారిందన్న మోడీ, అమిత్ షాలు ఏనాడూ నిలదీసి అడగలేదు. నిజాయితీగా ప్రశ్నించలేదు. విచారణకు ఆదేశించలేదు. ఇప్పుడు బనకచర్ల విషయంలో అలాంటి పొరపాట్లుజరక్కూడదు. ఎందుకంటే సాధ్యాసాధ్యాలపై కేంద్రం అధ్యయనం చేయించాలి. ఆర్థిక వనరులపై చర్చించాలి. బనకచర్ల ప్రాజెక్టు ఎత్తిపోతల ప్రాజెక్టు. కింది నుండి పైకి నీటిని ఎత్తిపోయడానికి 4,125 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుంది. ఇందుకు ప్రతి సంవత్సరం భారీగా ఖర్చు చేయాలి. నిపుణుల అంచనా ప్రకారం కొత్తగా సాగులోకి వచ్చే మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రతి సంవత్సరం ఒక ఎకరానికి రూ.50 వేలు ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చును ఎవరు భరించాలన్నది చెప్పాలి. ఎందుకంటే కాళేశ్వరంలో ఇదే జరిగింది. కాళేశ్వరం కొనసాగించాలంటే విద్యుత్ వినియోగం తడిసి మోపెడు అవుతుంది. ఇది కళ్లముందు కనిపిస్తున్న సత్యం. దీనిని కాదని బనకచర్ల అంటూ చంద్రబాబు పలవరించడం, కేంద్రం తలూపడం సరికాదు. ఇకపోతే బిఆర్ఎస్ గత తప్పిదాలను పక్కన పెట్టి బనకచర్లపై ఏదో కొంపలు అంటుకున్నట్లుగా గగ్గోలు పెడుతోంది. ప్రాజెక్టులన్నీ దెబ్బతిన్నా యని, వాటికి ప్రమాదం పొంచివుందని అంటోంది. పదేళ్లపాటు లేని ప్రమాదం ఏడాదిన్నరలో ఎలా వచ్చిందో హరీష్ రావు, కెటిఆర్‌లు చెప్పాలి. గగ్గోలు పెడితే అబద్దాలు నిజాలై పోవు. కాళేశ్వంరపై ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడలో భాగంగా బిఆర్ఎస్ హంగామా చేస్తోంది. ఎందుకంటే ఓ పద్దతి ప్రకారం ప్రాజెక్టులు, బనకచర్ల, స్కూళ్లు, హాస్టళ్లు తదితర సమస్యలపై ప్రస్తావిస్తూ తెలంగాణ ఆగమై పోయిందన్న రీతిలో మాట్లాడుతు న్నారు. బిఆర్ఎస్ నేతలు చేసే ఆరోపణలు నిజమైతే అందుకు వారే బాధ్యత వహించాలి.ఎందుకంటే పదేళ్ల పాటు తెలంగాణను ఏలింది వారే కనుక వారే సమాధానం చెప్పాలి.ఇకపోతే బనకచర్లపై ఎపిలో మాట్లాడి సాధ్యాసాధ్యాలు చర్చించాలి. ఎపి సిఎం చంద్రబాబు కూడా పోలవరం పూర్తి కాకుండానే ఇప్పుడు బనకచర్ల గురించి మాట్లాడుతున్నారు. అసలు లోటు బడ్జెట్‌లో ఉన్న సమయంలో దీనికి డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పడం లేదు. ఇది సాధ్యమా అన్నది చర్చించడం లేదు. విభజిత ఆంధ్రప్రదేశ్ తర్వాత పోలవరం ఆంధ్రకు వరం అంటూ హంగామా చేసిన నేతలే నేడు బనకచర్ల గురించి హడావుడి చేయడం వెనుక అనుమానాలు ఉన్నాయి.ఈ ప్రాజెక్టు కూడా కారట్రాక్టర్ల, రాజకీయ నాయకుల ఆదాయం సమకూర్చేదిగా మారకూడదన్నదే సకలజనుల అభిప్రాయం. గోదావరి వరద నీటిని రాయలసీమలోని పెన్నా బేసిన్‌కు మళ్లించి తద్వారా రాయలసీమ, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు ఇవ్వడం లక్ష్యంగా టిడిపి కూటమి ప్రభుత్వం చెబుతుంది. గోదావరి నుండి ప్రతి సంవత్సరం సుమారుగా రెండువేల టిఎంసీల నీరు వృధాగా సముద్రంలో కలిసిపోతుంది. ఈ నీటిలో పదో వంతు కనీసం 200 టిఎంసిల నీటిని వెనుకబడిన జిల్లాలకు మళ్లిస్తే రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెరుగుతుందంటూ నేతలు చెబుతున్నారు. ఇందుకోసం రూ.80,112 కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా అంచనా వేసి, జలహారతి కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ అంగీకరించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం సహాయం చేయాలని ప్రధానమంత్రిని, కేంద్ర ఆర్థికమంత్రిని రాష్ట్ర ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు ఢిల్లీ వెళ్లి కేంద్ర ఆర్థిక శాఖ, జలశక్తి శాఖ అధికారులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.


మూడు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి 48 వేల ఎకరాల భూమిని సేకరించడం, సుమారు 27 కిలో మీటర్ల సొరంగం తవ్వడం, రూ.80 వేల కోట్లు పైగా ఖర్చు పెట్టడం సాధ్యమయ్యే పనేనా అన్న అనుమానాలు వస్తున్నాయి. కాళేశ్వరం తరహాలో కాంట్రాక్టర్లకు దోచిపెట్టేందుకే అన్న అనుమానాలు వస్తున్నాయి. అందుకే కేంద్ర అధికారులు ఆదిలోనే అడ్డువేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ తోపాటు ఇతర హామీలు అమలు చేయడానికి ఖజానా ఖాళీ అని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం రూ.80 వేల కోట్ల భారీ ఖర్చుతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తాననడం అనుమానాలకు తావిస్తోంది. ఇది సాధ్యమేనా అని అనేకమంది ఇప్పటికే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అఖిలపక్ష సమావేశం వేసి, నీటిపారుదలరంగ నిపుణుల అభిప్రాయాలను, సూచనలను తీసుకోవడం ప్రభుత్వ కనీస బాధ్యత. ఆ తరవాతే దీనిపై ముందుకు సాగాలి. దీనికన్నా ముందు పోలవరం సజావుగా పూర్తి కావాలి. పోలవరం బాధితులు ఇప్పటికే రోడ్డున పడ్డారు. వారిని ఆదుకునే ప్రయత్నాలు ముందుకు సాగడం లేదు. భూములు, ఇళ్లు కోల్పోయిన గిగిరిజనులు గౌరవంగా బతికేలా చేయాలి. అమరావతికి భూమలు ఇచ్చిన రైతులు కూడా దర్జాగా బతకగలగాలి. ఇవన్నీ చేయకుండా, నిపుణలుతో చర్చించకుండా ముందుకు సాగాలనుకోవడం చంద్రబాబుకు తగనిపని. ఈ ప్రాజెక్టు గేమ్ చేంజర్, సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు, హైబ్రిడ్ యాన్యుటీ (హమ్) స్కీమ్ అని చెబుతున్నారు. ప్రాజెక్టులు కట్టి, నీటిపారుదల అభివృద్ధి చేస్తే ఎవరికి అభ్యంతరం వుండదు. కానీ గత ఐదేళ్ల చంద్రబాబు ప్రభుత్వ హయాలో అలా జరగలేదు. ఉమ్మడి ఎపిలో కూడా చంద్రబాబు అనేక ప్రాజెక్టులు చేపట్టినా పూర్తిచేయలేక పోయారు. గత కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన అనేక సాగునీటి ప్రాజెక్టులు పూర్తి కాలేదు. అవేవీ వ్యవసాయాభివృద్ధికి తోడ్పడలేదు. కానీ కాంట్రాక్టర్లకు, అధికార పార్టీల నాయకులకు ప్రధాన ఆదాయ వనరులుగా మారాయి. అందుకు పోలవరమే సాక్ష్యం. విభజన తరవాత ఐదేళ్లు పాలించిన చంద్రబాబు అమరావతిని, పోలవరాన్ని పూర్తి చేయలేక పోయారు. తరవాత అధికారంలోకి వచ్చిన జగన్ కూడా ఈ రెంటినీ పక్కన పెట్టి ఎపిని అప్పులకుప్పగా తయారు చేశారు. ఈ క్రమంలో కేంద్రం నుండి నిధులను రాబట్టకుండా ఈ ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారన్న దానికి సమాధానం లేదు. కానీ ఇరు తెలుగు రాష్ట్రాల మధ్య మాత్రం నిత్యం రచ్చ చేసుకునేలా చేస్తున్నారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే ఇప్పటికే పెట్టిన ఖర్చుకు ఫలితం దక్కుతుంది. వాటిని వదిలేసి భారీ ఖర్చులతో కొత్త ప్రాజెక్టులు ప్రకటిస్తున్నారు. ఇదంతా డబ్బులు దండుకోవడానికే అని వేరుగా చెప్పనక్కర లేదు. కేంద్రం కూడా సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. ఇప్పటికే విద్యుత్ ప్రైవేటీకరణ వల్ల నడ్డివిరిగి పోతున్న రాష్ట్ర ప్రజలు, సాగునీటికి భారీగా చార్జీలు చెల్లించి వ్యవసాయం చేయడం అసాధ్యం. కార్పొరేట్ అనుకూల విధానాలు మోడీ మన్ననలు పొందుతాయేమోకానీ ప్రజల వ్యతిరేకతను మాత్రం పెంచడం ఖాయం. అందువల్ల మాటలతో కాకుండా చేతలతో పనులు చూపాలి. సత్వరం పోలవరం పూర్తి చేసి నిర్వాసితులను ఆదుకోవాలి.

# భారతీయ పద్మభూషణ్ సమ్మాన్ అవార్డు ప్రదానం






హైదరాబాద్-గుండేటి ప్రవీణ్ కుమార్ యాదవ్ అబ్దుల్లాపూర్మెట్ ప్రజా స్వేచ్ఛ విలేకర్



భారతదేశ గొప్ప అవార్డు భారతీయ పద్మభూషణ్ సమ్మాన్ అవార్డు భారత ప్రభుత్వం న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి ఆడిటోరియం ఈ అవార్డును ప్రపంచ మానవ హక్కుల రక్షణ కమిషన్ జాతీయ ఉపాధ్యక్షుడు మరియు తెలంగాణ RTI రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కిఫాయత్ MD కి ప్రదానం చేసింది. ఈ అవార్డును భారతదేశంలోని 3 దళాల మేజర్ జనరల్స్ అందించారు: 1. భారత ఆర్మీ మేజర్ 2. భారత నేవీ మేజర్ 3. భారత వైమానిక దళంలోని మేజర్ జనరల్స్ సామాజిక సేవలో ఉత్తమ వ్యక్తిగా డాక్టర్ కిఫాయత్ MD జీకి భారతదేశ గొప్ప అవార్డును ప్రదానం చేశారు...



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# జులై 4న పీఏసీ సమావేశం

- అదే రోజు గ్రామస్థాయి నేతలతో బహిరంగసభ
- టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




హైదరాబాద్-ప్రజా స్వేచ్ఛ

రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం జులై 4న గాంధీభవన్‌లో జరుగుతుందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పీఏసీ సమావేశం అనంతరం పీసీసీ విస్తతస్థాయి సమావేశం ఉంటుందని తెలిపారు. అదే రోజు సాయంత్రం ఎల్బీ స్టేడియంలో గ్రామస్థాయి నేతలతో భహిరంగ సభ నిర్వహించనున్నట్టు వెల్లడించారు. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కమిటీ మీటింగ్‌లో బాగంగా నిర్వహిస్తున్న ఈ సభకు 15 వేల మంది హాజరుకానున్నారని తెలిపారు. వరంగల్ నేతలు వ్యవహారాలలో క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. జీవితాంతం లౌకికవాదిగా బతికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను ఒప్పుకోని డీఎస్ విగ్రహాన్ని బీజేపీ నాయకునితో ఆవిష్కరిస్తే ఆయన ఆత్మ క్షోభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్ విగ్రహ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించిందనీ, అయినా కాంగ్రెస్ నాయకులెవరికీ ఆహ్వానం లేదని తెలిపారు. డీఎస్ ఏనాడు బీజేపీలో లేరనీ, కొన్ని కారణాల వల్ల ఆయన బీఆర్ఎస్‌లో చేరారని గుర్తుచేశారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గానికి ఎప్పుడు ఉప ఎన్నిక జరిగినా కాంగ్రెస్ పార్టీయే గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని గుర్తిస్తామని తెలిపారు. మాజీ మంత్రి, దివగంత నేత ముఖేశ్ గౌడ్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కొత్తగా నియమించబడిన టీపీసీసీ ఉపాధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు పని విభజన చేస్తూ ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# ఏప్రిల్ 1నుంచి జనగణన

న్యూఢిల్లీ-ప్రజా స్వేచ్ఛ

2027 జనగణన యొక్క తొలి దశ వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానుంది. ఈ విషయాన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు రాసిన లేఖలో జనగణన కమిషనర్, భారత రిజిస్ట్రార్ జనరల్ మృత్యుంజరు కుమార్ నారాయణ్ వెల్లడించారు. ఈ తొలి దశలో హౌస్‌లిస్టింగ్ ఆపరేషన్స్ (గృహాల జాబితా కార్యాకలాపాలు), హౌసింగ్ సెన్సస్ (గృహాల గణన) కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. దీనికి ముందు సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకం, వారి పని పంపిణి రాష్ట్రాలు, జిల్లాల అధికారుల సహకారంతో జరుగుతుందని తెలిపారు. సాధారణంగా మన దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహిస్తారు. మొదటి దశలో గృహాల జాబితా కార్యకలాపాలు, రెండో దశలో జనాభా లెక్కింపు జరుగుతోంది. రాబోయే జనగణన రెండో దశ 2027 ఫిబ్రవరి 1 నుంచి జరగనుందని లేఖలో మృత్యుంజరు కుమార్ తెలిపారు. 2027 జనగణన దేశంలో 16వ జనగణన. స్వాతంత్ర్యం తరువాత ఎనిమిదవది. ఈసారి కుల గణన కూడా జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. అలాగే ఈ జనగణన కోసం ఇప్పటికే 36 ప్రశ్నలను ప్రభుత్వం సిద్ధం చేసింది. జనాభా లెక్కల కార్యక్రమంలో సుమారు 36 లక్షల మంది సిబ్బంది పాల్గొననున్నారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# ఘనంగా సికింద్రాబాద్ జగన్నాథ రథయాత్ర





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

ప్రజా స్వేచ్ఛ....
సికింద్రాబాద్ జగన్నాథ రథయాత్ర శుక్రవారం రోజున ఇస్కాన్ టెంపుల్ నుండి వై ఎం సి ఏ, ప్యాట్ని ఎక్స్ రోడ్,మెహబూబ్ కాలేజ్, బాటా బస్ స్టాప్, మార్కెట్ స్ట్రీట్ సర్కిల్, పలక బజార్, రీజినల్ పాస్పోర్ట్ ఆఫీస్, క్లాక్ టవర్, సంగీత్ ఎక్స్ రోడ్, ఇస్కాన్ సికింద్రాబాద్ వరకు రథయాత్ర కొనసాగింది. ఇందులో భాగంగా ముఖ్య అతిథులు చాలామంది భక్తులు అందరూ విచ్చేసి ఇస్కాన్ సంస్థ ఈ మంచి జగన్నాథ రథయాత్రని సనాతన ధర్మాన్ని కాపాడుతుంది భక్తులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయడం జరిగినది ఈ సంస్థ బాధ్యతగా హరే కృష్ణకు సంబంధించిన ఈరోజు ఈ శోభాయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మంచి అనుభూతి ప్రజల యొక్క సుభిక్షం కోసం ఈ రాష్ట్ర ప్రజలు ప్రశాంతంగా ఉండాలి అన్ని సమస్యల తొలగి పోవాలని సస్యశ్యామలంగా పాడిపంటలతో సుఖశాంతులతో వర్ధిల్లాలి ఇస్కాన్ సంస్థ రాధాకృష్ణునికి వేడుకొని ప్రార్థన చేస్తుంది . దీప హారతి కీర్తనలు కోలాటంలు రంగోలి నృత్య ప్రదర్శనలు దాండియా డాన్స్ లు చెప్పను బోగు ప్రసాదములు భక్తి పాటలు రసవత్తరంగా కొనసాగించారు ముఖ్య అతిథులు సంస్థ గురువర్యులు మరియు చాలామంది గురువులు సేవాసమితి బృందములు భజన కళాకారులు బృందములు ఎందరో కళాకారులు వారి బృందంతో విచ్చేసి రథయాత్రలు అధిగనంగా వైభవముగా భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు అక్కడ ప్రసాదములు అన్న ప్రసాదములు చల్లటి పానీయములు సంస్థ ద్వారా అందించారు ముఖ్య అతిథులు రిటైర్డ్ మెజిస్ట్రేట్ తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి గారు, హైకోర్టు అడ్వకేట్ తరిగొప్పుల అమరేందర్ ప్రజాపతి టిపిసిసి లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్ ఆర్ టి ఐ డిపార్ట్మెంట్ స్టేట్ కన్వీనర్ గారు. డిసిపి నార్త్ జోన్ రేష్మి పెరుమాళ్ గారు, హైదరాబాద్ సిటీ పోలీస్ జే భాస్కర్ ట్రాఫిక్ సిఐ గారు గోపాలపురం, చాలామంది పోలీస్ అధికారులు ట్రాఫిక్ ఇబ్బంది కాకుండా సేవలు కొనసాగించారు, ఆలయ సేవ కార్యనిర్వహణ అధికారులు శ్రీనివాస్ గారు, నారాయణస్వామి దాసు గారు, హరికృష్ణ ప్రభుదాస్ దేవి మాతాజీ రాందాస్,రవి రాజు బ్రదర్స్,రాణి మాతాజీ సుగుణాకర్ ప్రభు కూతురు యేషిత లక్ష్మి, భరత్ సోనాలి మాతాజీ, నీలి మాధవస్వామి, విశేషంగా తమ సేవలు తమ బాధ్యతలు నిర్వహించారు. శ్రీదేవి మాతాజీ శ్రీదేవ మాతాజీ ఈశ్వరి మమత రాజు ప్రణయ్ విష్ణు ప్రియ సుజాత శ్రీలయ వెంకట శరణ్య జగన్నాథ్ శ్రీ హర్షిత అక్షర మమత వెంకు సూత్ర వే సూర్య సౌజన్య శివాని తనూజ జయ భవాని అనిత మాత, సుబ్బు గణేష్ అరూప్ దీపక్ ప్రవీణ్ ఇందులో చాలా మంది భక్తులు పాల్గొని అతి గనంగా వైభవంగా ఈ రథయాత్ర కొనసాగించారు

## పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక




జగిత్యాల ,ప్రజా స్వేచ్ఛ...
పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక రాయికల్ మండలం కిష్టంపేట గ్రామంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. సంఘ అభివృద్ధి, సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ ఎన్నికలు నిర్వహించారని నిర్వాహకులు తెలిపారు. ఎన్నికైన కార్యవర్గం వివరాలు ఈవిధంగా ఉన్నాయి: అధ్యక్షులు పోతు మురళి, ఉపాధ్యక్షులు ఆడెపు మహేందర్, ప్రధాన కార్యదర్శి ఆడెపు మురళి, సహాయ కార్యదర్శి ఎలిగేటి మనోజ్, కోశాధికారి సిరిపురం సతీష్. నూతన పదవీలోకి వచ్చిన సభ్యులు మాట్లాడుతూ సంఘాన్ని అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు కృషి చేస్తామని, సభ్యుల ఐక్యతకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ ను కలిసిన అమీర్ పేట్ గ్రామ కాంగ్రెస్ నాయకులు.



మహేశ్వరం, ప్రజా స్వేచ్ఛ...
తెలంగాణ కాంగ్రెస్ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన డాక్టర్ పుంజల వినయ్ కుమార్ ను అమీర్ పేట్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ మహేశ్వరం మండల అధ్యక్షుడు ఇమ్మడి ప్రవీణ్ పటేల్, యూత్ అధ్యక్షుడు రాజు గొల్లూరి, వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆవుల రమేష్, నాయకులు తిరుమల సుధాకర్, రాఘవేందర్, రవీందర్ నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నేతి విద్యాసాగర్ జన్మదిన వేడుకలు

**వేడుకలలో పాల్గొన్న నకరికల్లు ఎమ్మెల్యే**





నకిరేకల్, ప్రజా స్వేచ్ఛ...
ఈరోజు నకరికల్లు మండలంలోని తెలంగాణ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ నేతి విద్యాసాగర్ జన్మదిన సందర్భంగా ఆదివారంనాడు ఘనంగా ఆయన జన్మదినం నిర్వహించడం జరిగినది అన్నాలగూడ నుండి మెయిన్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగినది అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొనడం జరిగినది ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 45 సంవత్సరాల పాటు కాంగ్రెస్ పార్టీ అండగా ఉన్న ఏకైక వ్యక్తి నేతి విద్యాసాగర్ అన్న ఆయన ధన్యజీవి ఆయన చేసిన సేవలు ప్రజలకు అందరికీ అందినాయి నా గెలుపుకై అహర్నిశలు కృషిచేసిన చాలా గొప్ప వ్యక్తి ఆయన ఇలాగే చిరకాలం చిరకాలం ఆ భగవంతుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరినారు

## జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి: సీఐటీయూ



మిర్యాలగూడ ,ప్రజా స్వేచ్ఛ:-
జులై 9న జరిగే కార్మికుల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తిరుపతి రామ్మూర్తి కోరారు. ఆదివారం స్థానిక ఎఫ్సీఐ వద్ద సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె కరపత్రాలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని తూట్లు పొడిచేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. కార్మికుల 26చట్టాలను రద్దుచేసి కొత్తగా నాలుగు లేబర్ కోడులను అమలు చేస్తుందని విమర్శించారు. కొత్త చట్టాల వల్ల కార్మికులు శ్రమదోపిడికి గురవుతారని శ్రమకు తగ్గ వేతనం అందదని, కార్మికుల సంక్షేమం కనుమరుగు అవుతుందన్నారు. భవిష్యత్తులో కార్మికులకు పని దొరకకుండా పోతుందని దానివల్ల వారి కుటుంబాలు వీధిన పడే అవకాశం ఉందన్నారు. కొత్తగా అమలు చేస్తున్న లేబర్ కోడులను రద్దు చేయాలని అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆ రోజున కార్మికులు తమ పనులను బంద్ చేసి సమ్మెలో పాల్గొని స్తంభింప చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు అంజన్ రావు బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

## మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సహాయం



గోపాల్ పేట్ ,ప్రజా స్వేచ్ఛ...
మండల పరిధిలోని బుద్ధారం పాటిగడ్డ తాండకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ పాత్లావత్ నార్య నాయక్ కరెంట్ షాక్ తో శనివారం మృతి చెందాడు. నార్య నాయక్ మృతి చెందిన విషయాన్ని తండా వాసులు మరణించిన విషయాన్ని మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సతీష్ శీలా రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వనపర్తి శాసనసభ్యులు ఎమ్మెల్యే మేఘా రెడ్డి మానవ దృక్పథంతో స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 10000/- ఆర్థిక సహాయం అందించడం జరిగింది. మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు ఉన్నారు

## వెలుగుల ప్రదాత శివ్వగల్ల సుమన్ హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు



ప్రజా స్వేచ్ఛ...
నందిగామ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు శివగళ్ళ సుమన్ ఆదివారం సాయంత్రం మహిమాన్విత శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి సొంత ఖర్చులతో స్తంభాలు వేసి వెలుగులు ప్రసాదించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు కాంగ్రెస్ యువ నాయకుడు శివగల సుమన్ మాట్లాడుతూ ఆ భగవంతుని కృప వల్ల నా సొంత ఖర్చులతో గుడి దగ్గర స్తంభాలు వేయించడం జరిగింది అలాగే లైట్లు వేయించడం జరిగింది శ్రీ లక్ష్మీనరసింహస్వామి అందరిని చల్లగా చూడాలని ఆ భగవంతుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నా అని అన్నారు ఈ కార్యక్రమంలో గంగిశెట్టి మల్లేష్, రవి, సత్తయ్య, నర్సింలు, ప్రవీణ్, పాత్లావత్ రవి, తదితరులు పాల్గొన్నారు..

## విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**మెను కచ్చితంగా పాటించాలి**

**జిల్లా బి.సి సహాయ అభివృద్ధి అధికారి ఆంజనేయులు**



గోపాల్ పేట్ ,ప్రజా స్వేచ్ఛ...
విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా బీసీ సహాయ అభివృద్ధి అధికారి ఎస్. ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ బి.సి బాలికల, బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు వండిన భోజనాన్ని, హాస్టల్ పరిసరాలు, వంటగదిని ఆయన పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ నిర్వహణ పాటించాలని హాస్టల్ నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు భోజనం చేసే ముందు తర్వాత ప్లేట్లు, చేతులు శుభ్రంగా కడుకునే విధంగా వసతి గృహ అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి అల్పాహారం సేవించారు ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారులు రమేష్ గౌడ్, జీవిత, ఉన్నారు

## ఏక కాలం లో రైతు రుణమాఫీ రైతు భరోసా అందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు


**బర్రె జహంగీర్**
**మాజీ మున్సిపాల్ చైర్మన్**



భువనగిరి,ప్రజా స్వేచ్ఛ... పెట్టుబడి సాయంతో రైతుల్లో ఆనందం – ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ఏక కాలంగా, రెండు లక్షల రైతుల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ కు కృతజ్ఞతలు. రైతులతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకున్న,బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్, పంటల,సాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం నగదు విడుదల చేయడం పట్ల రైతుల్లో ఆనందం నెలకొందని బర్రె జహంగీర్ భువనగిరి అన్నారు.ఆదివారం,ఆయన రైతులతో కలిసి వారి సమస్యలు,పెట్టుబడి సాయం అందిందా లేదా అంటూ ఆర తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,తెలంగాణ వ్యాప్తంగా 9 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ,9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులు ప్రతి ఒక్క రైతుకు సుమారు,15 ఎకరాలకు వరకు అందినట్లు ఆయన అన్నారు. కొంత మంది రైతుల అకౌంట్లు మారటంతో,పాటు ఆధార్ కార్డు పేర్లు తప్పులు దొర్లటం లాంటి సమస్యలతో పెట్టుబడి సాయం జమ కాలేదని. వీటిని సరిచేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైందని. వీరికి సైతం,వానాకాలం సాగు ప్రారంభంలోనే ప్రభుత్వం రైతు భరోసా నిధులు ఖాతాల్లో జమ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని. ఎకరాకు రూ. 12 వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు పెద్దబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించందని మరియు ఏక కాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులు ఉన్న ఇచ్చిన,మాట ప్రకారం రైతులకు రెండు లక్షల రుణ మాఫీ చేసిందని అన్నారు.రైతు కూలీలు,మాజీ కౌన్సిలర్ బల్లెం శ్రీరాములు,కుర్మ సుధాకర్ ఏడబోయిన అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

**లంచం అడిగితే ఫిర్యాదు చేయండి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**



జగిత్యాల ,ప్రజా స్వేచ్ఛ... ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి, ఫకీర్ కొండాపూర్ గ్రామాల్లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయాలి. నిర్మాణంలో ఎవరూ లంచాలు అడగరాదు. ఎవరికైనా లంచం అడిగితే వెంటనే 9440152929 నంబరుకు ఫోన్ చేయండి. అవినీతిపై కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు.గ్రామస్థులు, లబ్ధిదారుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు నాయిని సురేష్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గూడా శ్రీకాంత్ రెడ్డి, సేవాదళ్ మండలాధ్యక్షుడు వెంకటాద్రి, మాజీ ఎంపీపీ నేరెళ్ల దేవేందర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎల్లాల వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భూస రాజేష్, లింబాద్రి, మాలెపు శంకర్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు

## బిల్లా శ్రీదేవికి ఇంటర్నేషనల్ అవార్డు

**-హర్షం వ్యక్తం చేసిన స్వచంద సంస్థల ప్రతినిధులు**




గోదావరిఖని న్యూస్, ప్రజా స్వేచ్ఛ... రామగుండం ఎన్టీపీసీలోని అన్నపూర్ణ కాలనీకి చెందిన బిల్లా శ్రీదేవి సామాజిక సేవలో చురుకైన పాత్ర పోషిస్తూ, మహిళలకు స్ఫూర్తిగా నిలిచారని అభినందిస్తూ... ఇటీవల హైదరాబాద్ లో స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో సంస్థ 'భారతీయ నారిశక్తి ఇంటర్నేషనల్ అవార్డ్' తో బిల్లా శ్రీదేవిని ఘనంగా సత్కరించింది. అంతర్జాతీయ అవార్డు అందుకున్న బిల్లా శ్రీదేవిని స్వచంద సంస్థల ప్రతినిధులు గోలివాడ చంద్రకళ, , కంది సుజాత, ఇందారపు సునీత, జక్కెన శ్రీలత, గాదం సరిత, జమున, వనిత, కొండు రమ, మమత, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో బిల్లా శ్రీదేవి మరిన్ని ఉత్తమ అవార్డులను అందుకోవాలని ఆకాక్షించారు.

# జామే మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్





**-ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా దంపతులు**

సత్తుపల్లి ప్రజా స్వేచ్ఛ... ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గం – సత్తుపల్లి పట్టణం లో జామే మసీద్ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంప్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి మట్టా రాగమయి దయానంద్ దంపతులు హాజరయ్యారు. ముందుగా హెల్త్ క్యాంప్ కార్యక్రమాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.సత్తుపల్లి పట్టణ ప్రజలు కొరకు వారి ఆరోగ్య సంరక్షణ కోరుతూ ఇంతటి గొప్ప హెల్త్ క్యాంప్ నిర్వహించినందుకు జామే మసీద్ కమిటీ సభ్యులకు అలాగే ఈ హెల్త్ క్యాంపులో పాల్గొన్న ప్రముఖ డాక్టర్లకు పేరు పేరునా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేసారు. జామి మసీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో రోగులకు స్వయంగా ఎమ్మెల్యే దంపతులు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.నియోజకవర్గం లో ప్రజల ఆరోగ్య సంరక్షణార్థం ఉచిత హెల్త్ క్యాంపులు నిర్వహించే ప్రతి ఒక్కరికి స్థానిక ఎమ్మెల్యేగా, తోటి డాక్టర్లుగా, కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ దోమ ఆనంద్ బాబు, డాక్టర్స్ అశోక్ కుమార్ , డాక్టర్ షేక్ మౌలాలి , డాక్టర్ వనమా లక్ష్మణ్ సాయి , మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజాల రాణి, పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సొసైటీ చైర్మన్ చల్లగుల్ల కృష్ణయ్య, సీనియర్ నాయకులు కమల్ పాషా, మాజీ కౌన్సిలర్ గ్రాండ్ మౌలాలి, మాజీ కౌన్సిలర్స్ దూదిపాల రాంబాబు, మందపాటి పద్మజ్యోతి, కాంగ్రెస్ మహిళా నాయకురాలు కుమారి,సత్తుపల్లి జామే మసీద్ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్, పట్టణం, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# కళాకారులకు సంపూర్ణ మద్దతు





**-ఎమ్మెల్యే వై శ్రీనివాస్ రెడ్డి**

మహబూబ్ నగర్, ప్రజా స్వేచ్ఛ... అంబేద్కర్ కళాభవన్ లో కళాకారులకు సంపూర్ణ మద్దతు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కళాకారుల ఆట, పాట తెలంగాణ ఉద్యమానికి ఊపిరి నింపింది , ఉద్యమ కారులను ఏకం చేయుటకు పార్టీలకు అతీతంగా హైదరాబాద్ లో ధూం ధాం నిర్వహించాలి. బతుకమ్మ అంటే కేసీఆర్ కూతురైంది, ఉద్యమ కారులేమో కొడుకు అల్లుడు, అయింద్రు కళాకారులకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ పట్టణం లోని అంబేద్కర్ కళాభవన్ లో తెలంగాణ కళాకారులు ఆధ్వర్యంలో నిర్వహించిన "పాటల పల్లకిలో 12 గంటలు పాలమూరులో " కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో ఆశలు ఆకాంక్షలతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం కొందరి చేతిలోనే బంధీ అయిందని ఆయన అన్నారు. బతుకమ్మ అంటే ఆ ఇంటి ఆడపడుచు అయిందని, ఉద్యమకారులు అంటే కొడుకు, అల్లుడు అయ్యారని ఆయన ఆరోపించారు. మీ పాట లేనిదే తెలంగాణ ఉద్యమం లేదన్నారు. కవులు , కళాకారులు, గాయకులు, వారి పాట, ఆటల తోనే ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడింది అని తెలంగాణ ఉద్యమంలో కళాకారుల పాత్ర విలువ కట్టలేనిదని ఆయన చెప్పారు. గూడ అంజన్న, జయరాజ్, గోరేటి వెంకన్న, అందెశ్రీ లు కలం కు మీ గళం తోడై తెలంగాణ ఉద్యమాన్ని ప్రతి పల్లెకు, ప్రతి గూడెంకు , ప్రతి వాడకు ప్రతి ఊరికి తీసుకువెళ్ళారని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరిని ఉద్యమ ఆవశ్యకతను గురించి ఆలోచించే విధంగా మీ ఆట , పాట చేశాయని అనుటలో అతిశయోక్తి లేదు అని ఆయన చెప్పారు. ఊరు వాడా అనే తేడా లేకుండా తెలంగాణ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళడం లో కళాకారులు అందరూ సఫలీకృతం అయ్యారని ఆయన చెప్పారు. కానీ తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత గత పది సంవత్సరాలుగా పాట మీద, కళల మీద గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్బంధం విధించిందని ఆయన ఆరోపించారు. మీ ఆట, పాట, తెలంగాణ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనం అని ఆయన చెప్పారు. ప్రజా ప్రభుత్వం కళాకారుల పైన సానుకూల దృక్పథం తో ఉందని ఆయన అన్నారు. కేసిఆర్ ను అధికారంలో నుండి దించడం లో , ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడంలో కళాకారుల కృషి అభినందనీయం అని ఆయన అన్నారు. నిజాయితికి నిలువెత్తు నిదర్శనం కళాకారులని ఆయన చెప్పారు. మళ్ళీ ఒక్కసారి కేసిఆర్ అధికారంలోకి వస్తే నరమాంసం రుచి తెలిసిన రాబందుల్లా మీద పడేందుకు సిద్దంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. పార్టీలకు అతీతంగా తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన వారిని ఏకం చేసి హైదరాబాద్ లో ధూం ధాం నిర్వహించాలని, మీ సమస్యలు పరిష్కారించేందుకు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, అంజయ్య గౌడ్, ఉద్యమ కవి గాయకులు నేర్నాల కిషోర్ , టిపిసిసి సాంస్కృతిక సేన అధ్యక్షులు చక్రాల రఘు , జిల్లా కళాకారులు టంకర శ్రీనివాస్, ఎదిర నరసింహులు, ఎదిర బాలస్వామి , రాష్ట్ర మహిళా కళాకారులు అంతడుపుల రమాదేవి , డప్పు స్వామి , మురళి , జక్కగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# విలువలతో కూడిన విద్యను అందించాలి

**-ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



మహబూబ్నగర్ ,ప్రజా స్వేచ్ఛ.... విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించాలని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మహబూబ్ నగర్ పట్టణం లోని ఎంవిఎస్ కళాశాల రోడ్డు లో నూతనంగా ఏర్పాటు చేసిన గీతం ఉన్నత పాఠశాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే మహబూబ్ నగర్ అన్నింట్లో మొదటి స్థానంలో ఉంచాలన్నదే తన సంకల్పం అని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ అభివృద్ధికి మహబూబ్ నగర్ లోని విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపార వేత్తలు కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ప్రశాంత్, అంజద్ పాఠశాల కరస్పాండెంట్ సుధారాణి, డైరెక్టర్లు అనిల్, క్రిష్ణ , రిషి కళాశాల డైరెక్టర్ చంద్రకళ వెంకటయ్య, ప్రతిభ జూనియర్ కళాశాల డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజినెస్

# ఎంజీ కార్ల లవర్స్‌కు షాక్..
# జూలై 1 నుంచి ధరల పెంపు

జేఎస్‌డబ్ల్యూకు చెందిన ఎంజీ మోటార్ ఇండియా తన కార్ మోడళ్లలో చాలా వరకు ధరలను జూలై 1, 2025 నుంచి 1.5 శాతం వరకు పెంచనున్నట్లు ప్రకటించింది. మోడల్, వేరియంట్ ఆధారంగా పెంపు ఉంటుందని స్పష్టం చేసింది. పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులు, ఆర్థిక అంశాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. ఎంజీ శ్రేణి కామెట్ ఈవీతో పెంపు ప్రారంభమవుతుంది. ఈ కారు ధర రూ. 4.99 లక్షలు (ఎక్స్-షోరూమ్), తరువాత విండ్సర్ ఈవీ రూ. 10 లక్షలు. ఐసీఈ మోడల్స్ రూ. 11.30 లక్షలతో ఆస్టర్‌తో ప్రారంభమవుతాయి. ఆ తర్వాత హెక్టర్ రూ. 17.5 లక్షలతో వస్తుంది. అయితే టాప్-ఆఫ్-ది-లైన్ గ్లోస్టర్ ధర రూ. 41.07 లక్షలుగా ఉంది. ఎంజీకు సంబంధించిన ఎలక్ట్రిక్ మోడల్‌లు బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ ఎంపికతో కూడా వస్తాయి. వినియోగదారులు బ్యాటరీ లేకుండా కారును




కొనుగోలు చేయవచ్చు. అలాగే బ్యాటరీ కోసం సబ్‌స్క్రిప్షన్ చెల్లించాల్సి ఉంటుంది. భారతదేశంలో లగ్జరీ వాహన విభాగంలోకి ప్రవేశించడానికి ఎంజీ మోటార్ సన్నాహాలు చేస్తోంది. ప్రీమియం కార్ల రంగంలోకి అడుగుపెట్టడానికి గుర్తుగా ఎం9 లిమోజిన్‌ను విడుదల చేయాలని యోచిస్తోంది. ఈ సంవత్సరం చివర్లో స్టైల్, అధిక పనితీరును కలపడం లక్ష్యంగా పెట్టుకున్న ఆల్-ఎలక్ట్రిక్ కన్వర్టిబుల్ స్పోర్ట్స్ కారు సైబర్‌స్టర్‌ను పరిచయం చేస్తుంది. ఈ లగ్జరీ లాంచ్ లకు మద్దతుగా ఎంజీ సెలెక్ట్ అనే కొత్త బ్యానర్ కింద ప్రీమియం డీలర్‌షిప్‌ను అందిస్తోంది. ఈ అవుట్‌లెట్‌లు తమ ఫ్లాగ్‌షిప్ మోడళ్ల కొనుగోలుదారులకు మరింత వ్యక్తిగతీకరించిన, ఉన్నత స్థాయి కస్టమర్ ప్రయాణాన్ని అందిస్తాయి. ప్రస్తుత గ్లోస్టర్ నుంచి ప్రేరణ పొందిన లగ్జరీ ఎస్‌యూవీగా భావిస్తున్న మెజెస్టర్‌ను కూడా బ్రాండ్ టీజ్ చేసింది. ఇది త్వరలో ఎంజీకు సంబంధించిన ఇండియన్ లైనప్‌లో చేరే అవకాశం ఉంది.


## అపాచీ ఆర్‌టీఆర్ 160 మాడల్.
## ధర రూ.1.34 లక్షలు



**న్యూఢిల్లీ, జూన్ 28**
టీవీఎస్ మరో స్పోర్ట్స్ బైకును దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. అపాచీ బ్రాండ్‌లోనే ఆర్‌టీఆర్ 160 పేరుతో ఈ నయా మాడల్‌ను తీసుకొచ్చింది. ఈ బైకు ప్రారంభ ధర రూ.1.34 లక్షలుగా నిర్ణయించింది. రెండు రంగుల్లో లభించనున్న ఈ బైకు గతేడాది అందుబాటలోకి తీసుకొచ్చిన టాప్-ఎండ్ మాడల్ కంటే రూ.4 వేలు అధికం. డ్యూయల్-చానెల్ ఏబీఎస్ సిస్టమ్‌తో ఆధునీకరించిన తొలి బైకు ఇదే . 159.7 సీసీ ఇంజిన్‌తో తయారైన ఈ బైకు 16.04 పీఎస్‌ల శక్తిని, 5 స్పీడ్ గేర్‌బాక్స్, బ్లూటూత్ కనెక్టివిటీ, నావిగేషన్ సిస్టమ్‌తో అనుసంధానం చేసుకునే విధంగా డిజైన్ చేసినట్టు టీవీఎస్ మోటర్ బిజినెస్ హెడ్ విమల్ సౌంబ్లీ తెలిపారు.

# తులం బంగారం ధర ఎంత ఉందంటే..

బంగారం ధరలు కాస్త ఊరటనిస్తున్నాయి.. ఇటీవల లక్ష రూపాయలకుపైగా పరుగులు పెట్టిన పసిడి ధర ఇప్పుడు కొంత మేరకు వెనక్కి తగ్గింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగాయన్న వార్తలతో అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు క్రమంగా దిగివస్తున్నాయి. రికార్డు స్థాయికి చేరిన కొన్ని రోజుల్లోనే దాదాపు 5వేల వరకు బంగారం ధర తగ్గింది. ఇటీవల లక్షా రెండు వేలకు పైగా పెరిగిన తులం బంగారం ధర.. ఇప్పుడు దాదాపు 97 వేలుగా ఉంది.. అయితే.. డిమాండ్ తగ్గడం, అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు తగ్గడంతో భవిష్యత్తులో ధరలు మరింత తగ్గే అవకాశం ఉందంటున్నారు బులియన్ మార్కెట్ నిపుణులు.. వాస్తవానికి పసిడి, వెండికి ఎల్లప్పుడూ డిమాండే



ఉంటుంది.. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కోసారి తగ్గితే.. మరికొన్ని సార్లు పెరుగుతూ వస్తుంటాయి.. అయితే.. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి.. జూన్ 29 2025 ఆదివారం ఉదయం వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర 97,420 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.89,300 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,07,800లుగా ఉంది.

-హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.97,420 ఉంటే.. 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ.89,300 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,17,800లుగా ఉంది.
-విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.97,420, 22 క్యారెట్ల ధర రూ.89,300లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,17,800 లుగా ఉంది.
-ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.97,570, 22 క్యారెట్ల ధర రూ.89,450 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,07,800 లుగా ఉంది.
-ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.97,420, 22 క్యారెట్ల ధర రూ.89,300 ఉంది. వెండి ధర కిలో రూ.1,07,800 గా ఉంది.

# బుమ్రాపైనే ఎక్కువగా ఆధారపడొద్దు..

## కుల్దీప్‌ను ఆడించాలి

ఇంగ్లండ్ పర్యటనను ఓటమితో ఆరంభించిన భారత జట్టు సిరీస్ సమం చేయాలనే పట్టుదలతో ఉంది. ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే రెండో టెస్టులో విజయమే లక్ష్యంగా నెట్స్‌లో గంటలకొద్దీ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు టీమిండియా క్రికెటర్లు. అయితే.. సిరీస్‌లో కీలకమైన ఈ మ్యాచ్‌కు వర్క్‌లోడ్ కారణంగా పేసర్ జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో ఉండడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్ జట్టు కూర్పుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టు ఎక్కువగా బుమ్రాపై ఆధారపడుతోందని.. అలాకాకుండా బౌలర్లు సమిష్టిగా రాణించాలని అజారుద్దీన్ అభిప్రాయపడ్డాడు. 'భారత జట్టు బౌలింగ్ యూనిట్‌లో బుమ్రాపై అతిగా ఆధారపడుతోంది. ప్రతిసారి అతడు మెరుగైన ప్రదర్శన చేయలేడు కదా. పైగా ఇంగ్లండ్ పిచ్‌ల మీద అనుభవజ్ఞులైన బౌలర్లు ఉంటేనే వికెట్లు తీయగలం. అందుకే.. రెండో టెస్టులో కుల్దీప్ యాదవ్‌ను ఆడించాలి. చైనామన్ బౌలర్ అయిన కుల్దీప్







వైవిధ్యమైన బంతులతో బ్యాటర్లను బోల్తా కొట్టించగలడు. ఈమధ్య అతడు గొప్పగా రాణిస్తున్నాడు' అని అజారుద్దీన్ తెలిపాడు. లీడ్స్ టెస్టులో అనూహ్య ఓటమిపై కూడా ఈ దిగ్గజ క్రికెటర్ స్పందించాడు. 'బ్యాటింగ్ యూనిట్ ముఖ్యంగా లోయరార్డర్ వైఫల్యంతో ఓటమి ఎదురైంది. రెండో టెస్టులో ఇంగ్లండ్‌ను చిత్తు చేయాలంటే పక్కాగా సిద్ధమవ్వాలి. వికెట్లు తీయగల బౌలర్లను తీసుకోవాలి. అప్పుడే సిరీస్ సమయం చేయగలుగుతాం. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీ విషయానికొస్తే అతడికి ఇదే మొదటి సిరీస్. తొలి మ్యాచ్‌తోనే అతడి సారథ్యంపై అంచనాకు రాలేం. గిల్ ఈమధ్యే పగ్గాలు చేపట్టాడు కాబట్టి అతడికి కొంత సమయం ఇవ్వాలి. అతడిపై ఇప్పుడిప్పుడే విమర్శలు ఎక్కుపెట్టడం సరికాద'ని అజారుద్దీన్ అన్నాడు. భారత్, ఇంగ్లండ్‌ల మధ్య రెండో టెస్టు జూన్ 30న ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగనుంది.

# ఆర్‌సీబీ ప్లేయర్ యష్ దయాల్‌పై కేసు.. కారణం ఏంటంటే..?

ఐపీఎల్‌లో బెంగళూరు రాయల్ చాలెంజర్స్ ప్లేయర్ యష్ దయాల్‌పై కేసు నమోదైంది. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘజియాబాద్ ఇందిరాపురం పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన ఓ యువతి యూపీ సీఎం సీఎం పోర్టల్‌లో దయాల్‌పై ఫిర్యాదు చేసింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి తనను శారీరకంగా.. మానసికంగా వేధించాడని ఆరోపించింది. సదరు క్రికెటర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. సీఎం పోర్టల్‌లో చేసిన ఫిర్యాదులో ఆ అమ్మాయి తాను ఐదు సంవత్సరాలుగా క్రికెటర్‌తో సంబంధం ఉందని.. తనను పెళ్లి చేసుకుంటానని ప్రలోభ పెట్టాడని.. కాబోయే కోడలంటూ కుటుంబానికి చూపించాడని.. ఆ తర్వాత శారీరకంగా, మానసికంగా వేధింపులకు




గురి చేశాడని ఆరోపించింది.కొంతకాలం తర్వాత ఇతర అమ్మాయిలతో సంబంధాలున్నాయని తెలిసిందని ఫిర్యాదులో తెలిపింది. దీనిపై ప్రశ్నించిన సమయంలో తనను వేధించినట్లుగా పేర్కొంది. ఈ విషయంపై ఈ నెల 14న మహిళా హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు చేశానని.. కానీ, పోలీసులు ఎలాంటి చర్య తీసుకోలేదని ఆరోపించింది. పోలీసులకు ఆధారాలు చూపించానని.. బాధితురాలు వాట్సాప్, స్క్రీన్‌షాట్స్, వీడియోకాల్స్, క్రికెటర్‌తో ఉన్న ఫొటోలను పోలీసులకు ఆధారాలుగా చూపించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు యష్ దయాల్‌పై కేసు నమోదు చేసినట్లు డీసీపీ నిమిష్ పాటిల్ తెలిపారు. ఈ విషయంపై దర్యాప్తు జరుగుతుందని, వాస్తవాల ఆధారంగా చర్యలుంటాయని పేర్కొన్నారు.

## స్పోర్ట్స్

## హైబ్రిడ్ మోడల్‌లో ఆసియాకప్..
## జూలైలో షెడ్యూల్..!




ఈ ఏడాది జరగాల్సిన పురుషుల ఆసియా కప్ నిర్వహణపై అనిశ్చితి కొనసాగుతోంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య క్రికెట్ సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో టోర్నీ సాధ్యాసాధ్యాలపై ఆసియా క్రికెట్ మండలి మల్లగుల్లాలు పడుతోంది. అయితే.. ఇరుదేశాలు తటస్థ వేదికపై ఆడేందుకు అంగీకరిస్తాయనే ఉద్దేశంతో ఏసీసీ షెడ్యూల్ విడుదలకు సిద్ధమవుతోంది. జూలై రెండో వారంలో పూర్తి షెడ్యూల్ ప్రకటించేందుకు సన్నాహకాలు చేస్తోంది.దాయాది దేశాల బోర్డులు తమ పట్టుసడలిస్తే సెప్టెంబర్‌లో ఆసియా కప్‌ను ప్రారంభించాలని మొహ్సిన్ నఖ్వీ నేతృత్వంలోని ఏసీఏ భావిస్తోంది. షెడ్యూల్ ప్రకారం భారత్ వేదికగా సెప్టెంబర్ రెండో వారం అంటే.. 10 వ తేదీన ఆసియా కప్ జరగాల్సి ఉంది. టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్న ఈ టోర్నీలో భారత్, పాకిస్థాన్‌లతో పాటు అఫ్గనిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, యూఏయూలు ట్రోఫీ కోసం పోటీ పడనున్నాయి. కానీ.. భారత్, పాకిస్థాన్‌ల మధ్య పరిస్థితులు ఇంకా చక్కబడలేదు. దాంతో, ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్ లో ఆడించాలని ఏసీఏ యోచిస్తోంది. తమ గడ్డపై ఆసియా కప్ మ్యాచ్‌ల నిర్వహణకు యూఏఈ సిద్ధంగా ఉంది. అయితే.. షెడ్యూల్ విడుదలయ్యాక బీసీసీఐ ఆలోచన ఏమైనా మారుతుందా? అనే ఏసీఏ వేయి కళ్లతో ఎదురుచూస్తోంది.

**ఐసీసీకి బీసీసీఐ లేఖ**
పహల్గాం ఉగ్రదాడికి ప్రతిచర్యగా భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. అంతేకాదు ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడే ప్రసక్తే లేదని.. ఇకపై తమను ఒకే గ్రూప్‌లో ఉండకుండా చూడాలని ఐసీసీకి బీసీసీఐ లేఖ రాసింది. దాంతో, అంతర్జాతీయ టోర్నీలో తప్ప ద్వైపాక్షిక సిరీస్‌లో దాయాది దేశాల ఆట చూడడం ఇక అసాధ్యమే. దాంతో, ఐసీసీ ఈవెంట్లు, ఆసియా కప్ వంటి టోర్నీల్లో భారత్, పాక్ తలపడితే చూడాలని అభిమానులు ఎంతో ఆతృతతో ఉన్నారు.




# పేరు మార్చుకున్న.. మీనాక్షి చౌదరి!



గత సంవత్సరం లక్కీ భాస్కర్, ఈ యేడు సంక్రాంతికి వస్తున్నాం వంటి సినిమాలతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న పొడుగు కాళ్ల సుందరి మీనాక్షి చౌదరి తమిళ, తెలుగు చిత్రపరిశ్రమల్లో శ్రేణి హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకుని తీరిక లేకుండా దూసుకుపోతుంది. తమిళంతో ఒకటి రెండు చిత్రాలతోనే సరి పెట్టిన ఈ ముద్దుగుమ్మ తెలుగులో వరుస అవకాశాలతో బిజీగా ఉంటోంది.అయితే ఈ అమ్మడు తన అదృష్టాన్ని మరింతగా పెంచుకునేందుకు తన పేరులో సంఖ్యాశాస్త్రాన్ని నమ్ముకుంటూ చిన్నమార్పులు చేసుకుంది. తన పేరులోని MEENAKSHI CHAUDHARY బదులుగా ఇపుడు ఒక 'ఏ' అక్షరాన్ని నేర్చి. "MEENAAKSHI CHAUDHARY' మార్చుకుంది. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతుంది.ఇదిలాఉంటే.. మీనాక్షి చౌదరి తాజాగా నవీన్ పోలిశెట్టి తో 'అనగనగా ఒక రాజు, 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో నాగ చైతన్య సరసన ఓ సినిమా చేయబోతుంది. ఇవే గాక మరో నాలుగు ఇంట్రెస్టింగ్ చిత్రాలు లైన్‌లో ఉన్నాయి. తాజాగా పేరు మార్పుతో తన అదృష్టం మరింతగా రెట్టింపు అవుతుందని, అవకాశాలు మరిన్ని తలపులు తడుతాయనే ఆశతో ఉంది.

# రీ రిలీజ్‌కి రెడీ అవుతున్న చిరంజీవి 'స్టాలిన్'

మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు శుభవార్త!. 2006లో విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధించిన ఆయన సూపర్ హిట్ చిత్రం 'స్టాలిన్' రీ-రిలీజ్‌కు సిద్ధమవుతోంది. దాదాపు 19 ఏళ్ల తర్వాత ఈ చిత్రం తిరిగి థియేటర్లలో సందడి చేయనుండటంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ సినిమాను ఆగస్టు 22న చిరంజీవి బర్త్‌డే కానుకగా విడుదల చేయబోతున్నట్లు తెలుస్తుంది.తమిళ దర్శకుడు ఎ.ఆర్.మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'స్టాలిన్' చిత్రంలో చిరంజీవి సామాజిక సేవకుడిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటించగా, మణిశర్మ అందించిన సంగీతం, ముఖ్యంగా పాటలు అప్పట్లో పెద్ద హిట్ అయ్యాయి.

# ఇంట్రెస్టింగ్‌గా 'ఏఐఆర్' ట్రైలర్




యువ నటులు హర్ష రోషన్, భాను ప్రకాశ్, జయతీర్థ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న వెబ్ సిరీస్ 'ఏఐఆర్ (ఆల్ ఇండియా ర్యాంకర్స్)'. ఈ వెబ్ సిరీస్‌కు జోసెఫ్ క్లింటన్ దర్శకత్వం వహిస్తుండగా.. సందీప్ రాజ్ నిర్మించాడు. చైతన్యరావ్, సునీల్, వైవా హర్ష తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో ఈ వెబ్ సిరీస్ జులై 3 నుంచి స్ట్రీమింగ్ కాబోతుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. టెన్త్ అయ్యాకా.. ఇంటర్‌లోకి వెళ్లి ఆల్ ఇండియా ర్యాంకర్స్ తెచ్చుకోవాలని ఒత్తిడి చేసే తల్లిదండ్రులు.. ఇష్టం లేని చదువు చదవలేక పిల్లల ఆధారంగా ఈ సినిమా రాబోతుంది. ఇంట్రెస్టింగ్‌గా సాగిన ఈ టీజర్‌ను మీరు చూసేయండి.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ జోరు..

## అన్నపూర్ణ స్టూడియోస్‌లో పవన్ కళ్యాణ్!

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ మరియు దర్శకుడు హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్' . గబ్బర్‌సింగ్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుంటడంతో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాజకీయాలకు విరామం ఇచ్చి సినిమాలను కంప్లీట్ చేస్తున్నాడు. ఇప్పటికే హరిహర వీరమల్లు, ఓజీ సినిమా షూటింగ్‌లను కంప్లీట్ చేసిన పవన్ ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్‌ని కూడా పూర్తి చేస్తున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్‌కి సంబంధించి ప్రస్తుతం ఒక అప్‌డేట్ వైరలవుతుంది.ప్రస్తుతం అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతున్నట్లు సమాచారం. పలు కీలక సన్నివేశాలను పవన్ కళ్యాణ్‌తో తెరకెక్కిస్తున్నాడు హరీశ్ శంకర్. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన యువ నటి శ్రీలీల సందడి చేయనుంది. ఈ సినిమాకు దర్శకుడు దశరథ్ స్క్రీన్‌ప్లే అందిస్తున్నారు. సాక్షి వైద్య, అశుతోష్ రానా, గౌతమి, నాగ మహేష్, టెంపర్ వంశీ, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ ఈ భారీ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు.





# వెకేషన్‌లో సూర్య -జ్యోతిక..

టీవల 'రెట్రో' సినిమాతో సూపర్‌హిట్‌ను అందుకున్న తమిళ నటుడు సూర్య.. ప్రస్తుతం సినిమాలకు బ్రేక్‌నిచ్చి ఫ్యామిలీతో గడుపుతున్నాడు. తాజాగా తన భార్య నటి జ్యోతికతో కలిసి వెకేషన్‌కి వెళ్లాడు. ఈస్ట్ ఆఫ్రికాలోని సీషెల్స్‌కు ఈ జంట విహార యాత్రకు వెళ్లింది. బీచ్‌లో ఎంజాయ్ చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ వీరిద్దరూ సేదతీరారు. దీనికి సంబంధించిన ఫొటోలతో పాటు వీడియోలను జ్యోతిక ఇన్‌స్టా వేదికగా పంచుకుంది. 'స్వర్గంలో మరో రోజు మనిద్దరం' అని క్యాప్షన్ ఇచ్చింది.సినిమాల విషయానికి వస్తే.. సూర్య ప్రస్తుతం వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ దీనిని నిర్మిస్తున్నారు. మమితా బైజు కథానాయికగా నటిస్తుంది. దీనితోపాటు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో 'కరుప్పు'లో సూర్య నటిస్తున్నారు. జ్యోతిక విషయానికి వస్తే.. ఇటీవల డబ్బా కార్టెల్ అనే వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492